కేయూ డిగ్రీ పరీక్ష ఫీజు నోటిఫికేషన్ విడుదల

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 26 : నవంబర్‌లో జరిగే కేయూ డిగ్రీ మొదటి, మూడో, ఐదో(రెగ్యులర్, బ్యాక్‌లాగ్) సెమిస్టర్ పరీక్షా ఫీజు నోటిఫికేషన్‌ను పరీక్షల నియంత్రణాధికారి నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి తిరుమలాదేవి విడుదల చేశారు. అపరాధ రుసుం లేకుండా అక్టోబర్ 5వ తేదీ వరకు చెల్లించొచ్చని, వివరాలకు www.kakatiya.ac.in లేదా www.kuonline.co.in చూడొచ్చన్నారు.

నేడు ఐటీఐలో జాబ్ మేళా

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 26 : ములుగురోడ్‌లోని వరంగల్ ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో ఈ నెల 27న టామ్‌కామ్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. విదేశాల్లో ఉద్యోగాల కోసం ఆసక్తి గల అభ్యర్థులు రెజ్యూమ్‌ను tomcom.resume@gmail.coms పంపాలని, వివరాలకు www.tomcom.telangana.gov.inలో లేదా 99854 83931, 79959 57779, 78935 66493 సంప్రదించాలని కోరారు.

'బయోటెక్నాలజీ రంగంలో యువ శాస్త్రవేత్తలు అవసరం'

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 26 : బయోటెక్నాలజీ రంగంలో యువ శాస్త్రవేత్తల అవసరం ఉందని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ డైరెక్టర్ రీతూశర్మ అన్నారు. కేయూలో జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యూజీసీ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డి, జువాలజీ విభాగం హెడ్ ప్రొఫెసర్ శమిత, రాజేందర్, పర్చ శ్రీనివాస్, పెరుగు శ్యాం, ప్రొఫెసర్లు వెంకయ్య, నారాయణ, మామిడాల ఇస్తారి పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో దొంగలు పడ్డారు

దిమ్మెలను కూల్చి ఎత్తుకెళ్లిన ఇనుప గ్రిల్స్

- దిమ్మెలు కూల్చి ఇనుప గ్రిల్స్ దొంగతనం
- ముగ్గురు పరార్.. పోలీసుల అదుపులో ఒకరు

వరంగల్, సెప్టెంబర్ 26 : నగర నడిబొడ్డున ఉన్న గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాయలంలో దొంగలు పడ్డారు. కార్యాలయం అవరణలోని గార్డెన్ చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్‌ను దర్జాగా ఎత్తుకెళ్లారు. కార్యాలయం ముగిసే సమయానికే దొంగతనం జరుగడం గమనార్హం. బల్దియా ప్రధాన కార్యాలయం ముందు ఉన్న గార్డెన్‌లోకి పశువులు వెళ్లకుండా అధికారులు గ్రిల్స్ ఏర్పాటు చేశారు. అయితే గురువారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో దిమ్మెలను కూల్చి సుమారు తొమ్మిదికి పైగా ఇనుప గ్రిల్స్‌ను ఎత్తుకెళ్లారు. మరో రెండు గ్రిల్స్‌ను తొలగించి వాహనంపై పెట్టుకుంటుండగా స్థానికులు చూసి మట్టెవాడ పోలీసులకు సమాచారం అందించారు. దొంగతనానికి పాల్పడిన నలుగురు వ్యక్తులను సెక్యూరిటీ సిబ్బంది పట్టుకునేందుకు ప్రయత్నించగా ముగ్గురు పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకోగా సెక్యూరిటీ సిబ్బంది ఒక్కరిని పోలీసులకు అప్పగించారు. పోలీసులు దొంగను మట్టెవాడ పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. కాగా, సాయంత్రం 6 గంటల సమయంలోనే ఇనుప గ్రిల్స్ దొంగతనం జరిగితే చూడలేని సెక్యూరిటీ సిబ్బంది అర్ధరాత్రి ఏం రక్షణ కల్పిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో వాహనాల బ్యాటరీలు, డీజిల్, ఇతర సామాన్లు దొంగతనం జరిగిన ఘటనలూ ఉన్నాయి. ఈ గార్డెన్ మధ్యాహ్నం పంచాయతీ, సెటిల్‌మెంట్లకు, రాత్రి వేళ్లలో మందుబాబులకు అడ్డాగా మారిందనే విమర్శలు లేకపోలేదు. ప్రతిరోజూ గార్డెన్ శుభ్రం చేసే సిబ్బందికి మద్యం సీసాలు కనిపంచడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నది. ఇప్పటికైనా అధికారులు కార్యాలయ సెక్యూరిటిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

హసన్‌పర్తి : ఉపాధ్యాయులుతో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, క్లబ్ సభ్యులు

పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్, సెప్టెంబర్ 26 : పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కార్పొరేషన్, ప్రతిమ కాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బల్దియాలో ఎక్కువగా మహిళా కార్మికులు ఉన్నారని, వీరికి క్యాన్సర్ స్క్రీనింగ్, వివిధ రకాల పరీక్షలు చేస్తున్నారన్నారు. మేయర్ మాట్లాడుతూ.. కార్మికుల మాస్టర్ చెకప్ కోసం ఆరోగ్య కార్డులు ఇవ్వాలని ప్రతిమ ఆస్పత్రి యాజమాన్యాన్ని కోరామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. మహిళా కార్మికులకు పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. అనంతరం కార్మికులకు హెల్త్ కార్డులు, పీపీఈ కిట్లను అందజేశారు. కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్, సీఎంహెచ్‌వో రాజేశ్, సీహెచ్‌వో రమేశ్, టీపీవో కోలా రాజేశ్‌కుమార్ గౌడ్, డీఎఫ్‌వో శంకరలింగం, బయాలజిస్ట్ మాధవరెడ్డి, ప్రతిమ ఆస్పత్రి డైరెక్టర్లు అవినాశ్ తిప్పని, రాహుల్ నారాయణ్, క్లినికల్ అంకాలజిస్ట్ సుచిత్ర తిప్పని, హెడ్, నెక్ సర్జరీ అంకాలజిస్ట్ అభినవ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే జాతి నిర్మాతలు..

హసన్‌పర్తి : ఉపాధ్యాయులే జాతి నిర్మాతలని ఎమ్మెల్యే నాయిని అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల పంపిణీ కార్యక్రమం భీమారం ఎస్వీఎస్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోటరీ క్లబ్ వారు ఉపాధ్యాయులను జాతి నిర్మాతలు అని సత్కరించడం హర్షించదగ్గ విషయమని క్లబ్ అధ్యక్షుడు శారు ప్రభాకర్‌రెడ్డిని అభినందించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్ది వారి భవిష్యతుకు బాటలు వేస్తారని కొనియాడారు. పూర్వపు గవర్నర్ శరత్‌బాబు, క్లబ్ కార్యదర్శి ప్రవీణ్‌రావు, కోశాధికారి విజయ్‌కుమార్, అవార్డు కమిటీ చైర్మన్ సతీశ్, ఎస్వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు పాల్గొన్నారు.

పిల్లల చదువు, పోషణపై శ్రద్ధ చూపాలి : కలెక్టర్

చిన్నారితో అక్షరాభ్యాసం చేయిస్తున్న లెక్టర్ ప్రావీణ్య

ఐనవోలు, సెప్టెంబర్ 26 : పిల్లల చదువులు, పోషణపై తల్లులు శ్రద్ధ చూపించాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పోషణ మాసోత్సం కార్యక్రమంలో కలెక్టర్ చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేయించారు. అనంతరం ఐనవోలు జడ్పీ పాఠశాలను సందర్శించారు. 6వ తరగతికి వెళ్లి విద్యార్థులను చదివించారు. పాఠశాలలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతి, బిల్స్ పెండింగ్‌పై ఎంపీడీవో వెంకటేశ్వర్లును ఆరా తీశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. నూతనంగా ఏర్పడిన ఐనవోలు మండలంలో సరిపోను స్థలం ఉంటే అన్ని కార్యాలయాలను ఒకే కాంపెక్స్‌లో స్థానిక ఎమ్మెల్యే సహకారంతో నిర్మించడానికి ప్రయత్నించాలన్నారు. డీఈవో వాసంతి, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ రాజమణి, తహసీల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డీటీ అనిల్‌కుమార్, ఎంపీవో రఘుపతిరెడ్డి, ఏపీవో కుమారస్వామి, సీడీపీవో విశ్వజ, ఆర్ఐలు మల్లయ్య, రాణి, సూపర్‌వైజర్లు రజిత, సృజన, రాజేశ్వరి, పద్మ, సమ్మక్క పాల్గొన్నారు.

'ములుకనూరు' పరపతి సంఘం

రైతుల పాలిట కల్పతరువు

నేడు 68వ వార్షిక మహాసభ

భీమదేవరపల్లి, సెప్టెంబర్ 26 : ములుకనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం మెట్ట ప్రాంత రైతులకు కల్పతరువుగా మారింది. ములుకనూరు గ్రామానికి చెందిన అల్గిరెడ్డి కాశీవిశ్వనాథ రెడ్డి, పడాల చంద్రయ్య మరికొంతమందితో కలిసి 1956లో ములుకనూరు సహకార గ్రామీణ బ్యాంకును స్థాపించారు. కేవలం 373మంది సభ్యులు, రూ. 2300 వాటాధనంతో ప్రారంభించారు. బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షులుగా కాశీవిశ్వనాథరెడ్డి, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. సంఘంలో ప్రస్తుతం 7,641మంది సభ్యులుండగా సహకార స్ఫూర్తితో ముందడుగు వేస్తున్నది. సభ్యుల సహకారంతో ప్రతి ఏటా రూ.300కోట్లకు పైగా టర్నోవర్‌తో దినదినాభివృద్ధి చెందుతున్నది. ఆర్బీఐ సూచన మేరకు ముల్కనూరు సహకార బ్యాంకు 2019లో ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి సంఘంగా మారింది. రైతుల సౌఖర్యార్థం సంఘ పరిధిలోని 14గ్రామాల్లో గోదాములను నెలకొల్పింది. ప్రతి ఎకరాకు రూ. 40వేల చొప్పున స్వల్పకాలిక పంట రుణం కల్పించి వారి ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నది. ఎంబీబీఎస్, అగ్రికల్చర్, వెటర్నరీ, బిఫార్మసీ లాంటి కోర్సులు చదువుతున్న సభ్యుల పిల్లలకు ఉపకార వేతనాలు అందజేస్తూ విద్యాభివృద్ధికి దోహదపడుతున్నది. కాగా, ములుకనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం 68వ వార్షిక మహాసభ శుక్రవారం ములుకనూరులోని పారాబాయిల్డ్ రైస్‌మిల్లు ఆవరణలో జరుగుతుందని సంఘం అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. సభ్యులు హాజరుకావాలని కోరారు.

సభ్యుల పరస్పర సహకారంతో అభివృద్ధి..

– అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, పరపతి సంఘం అధ్యక్షుడు

సభ్యుల పరస్పర సహకారం వల్లే ములుకనూరు సహకార గ్రామీణ పరపతి సంఘం దినదినాభివృద్ధి చెందుతున్నది. పాలకవర్గం, రైతుల సమష్టి కృషితో సొసైటీ ప్రగతి బాటలో పయనిస్తున్నది.

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

వరంగల్ : ఉర్సు రంగలీలా మైదానంలో అంగరంగ వైభవంగా జరిగే బతుకమ్మ, దసరా ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను దసరా ఉత్సవ కమిటీ విజ్ఞప్తి చేసింది. గురువారం కార్పొరేషన్‌లో మేయర్‌ను కలిసి ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లపై విన్నవించారు. దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షులు నాగపురి సంజయ్‌బాబు, ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండ వెంకన్నగౌడ్, సహాయ కోశాధికారి వెలిదె శివమూర్తి, ప్రతినిధులు వంగరి కోటేశ్వర్, నాగపురి రంజిత్, పొగాకు సందీప్, బత్తిని అఖిల్, నరిగె శ్రీను, నాగపురి మహేశ్ పాల్గొన్నారు.

నగరంలో కొండచిలువ కలకలం

అటవీ శాఖ సిబ్బంది, స్నేక్ క్యాచర్ టీం బంధించిన సుమారు 15 అడుగుల కొండచిలువ

వరంగల్, సెప్టెంబర్ 26 : నగరంలో అర్ధరాత్రి కొండచిలువ కలకలం సృష్టించింది. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం పక్కన ఉన్న వినాయక విగ్రహాలు తయారు చేసే షెడ్‌లో భారీ కొండచిలువ కనిపించడంతో అక్కడ పని చేస్తున్న సిబ్బంది భయాందోళనలకు గురయ్యారు. పోలీసులు, ఆటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్నేక్ క్యాచర్ టీం అక్కడికి చేరుకుని కొండచిలువను బంధించారు. సుమారు 15 అడుగుల పొడవు ఉన్న కొండచిలువను జంతు ప్రదర్శన శాలకు తరలించినట్లు సమాచారం.

శాయంపేట పీఏసీఎస్ సీఈవో సస్పెన్షన్!

కమిటీకి సిఫారసు చేసిన డీసీవో

శాయంపేట, సెప్టెంబర్ 26 : శాయంపేట పీఏసీఎస్ సీఈవో గుర్రం రాజమోహన్‌ను సస్పెన్షన్ చేయాలని జిల్లా సహకార శాఖ అధికారి నీరజ సిఫారసు చేశారు. పీఏసీఎస్ కమిటీకి సస్పెన్షన్ లేఖ పంపినట్లు ఆమె గురువారం వెల్లడించారు. రైతు రుణమాఫీలో అవకతవకలు చేసినటట్లు సీఈవోపై ఆరోపణలు వచ్చాయి. శాయంపేట మాజీ సర్పంచ్ కందగట్ల రవి సీఈవో వల్ల తనకు రుణమాఫి జరగలేదని డీసీవోకు ఫిర్యాదు చేశారు. డీసీవో ఆదేశాలతో నోడల్ అధికారి రాధిక బృందం పీఏసీఎస్ రికార్డులను పరిశీలించి ప్రాథమిక నివేదికను అందజేశారు. సీఈవో రాజమోహన్ నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలడంతో సస్పెన్షన్ చేయాలని ఆదేశించినట్లు డీసీవో చెప్పారు. అయితే సీఈవో వ్యవహారంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో డీసీవో పీఏసీఎస్ కమిటీకే సస్పెన్షన్ చేయాలని పంపించడం గమనార్హం.

ఖాతాదారుల నుంచి కమిషన్ వసూలు చేయొద్దు

హనుమకొండ, సెప్టెంబర్ 26 : బ్యాంకింగ్ కరస్పాండెంట్స్ ఖాతాదారుల వద్ద కమిషన్ వసూలు చేయొద్దని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి బ్యాంకర్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అర్హత ఉన్న ప్రతి ఖాతాదారుడికి రూపే కార్డు అందించడంతో పాటు బీమా పథకాలు వర్తింపజేయాలని కోరారు. 2023–24 సంవత్సరానికి 120 శాతం లక్ష్యం సాధించిన బ్యాంకర్లను అభినందించారు. నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, ఆర్బీఐ మేనేజర్ పల్లవి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ ఉన్నారు.

27 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 26 : కాంట్రాక్ట్ పద్ధతిలో సేవలందించడానికి సంసిద్ధులైన డీఎస్సీ–2008 అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి తెలిపారు. అభ్యర్థులు తమ నిజ ధ్రువీకరణ పత్రాలు, ఒక సెట్ జిరాక్స్ కాపీలతో ఈ నెల 27 నుంచి అక్టోబర్ 5 వరకు నిర్వహించే సర్టిఫికెట్ల పరిశీలనకు డీఈవో కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

భీమదేవరపల్లి, సెప్టెంబర్ 26 : సిద్దిపేట–ఎల్కతుర్తి నేషనల్ హైవే పనులు నాసిరకంగా చేపడుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని కొత్తపల్లి పెద్దమ్మగుడి వద్ద ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల సీపీఐ కార్యకర్తలతో కలిసి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు అదరి శ్రీనివాస్, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేశ్, ఊటుకూరి రాములు, కర్రె లక్ష్మణ్, సిరబోయిన కర్నాకర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఓరుగల్లు విద్యార్థులు

న్యూశాయంపేట, సెప్టెంబర్ 26 : భారత్ వికాస్ పరిషత్, తెలంగాణ ప్రాంత విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి జాతీయ బృంద గీతాల పోటీల్లో 24 మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు సుధీర్‌కుమార్, సస్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ఇందిరా చంద్రశేఖర్ ఆడిటోరియంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి జాతీయ బృంద గీతాల పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

సహకార డెయిరీలకు సమాధి!

- హైదరాబాద్ పాలమార్కెట్‌పై ఆధిపత్యానికి హెరిటేజ్ యత్నం
- సర్కారు ప్రోత్సాహంతో ప్రాంతేతరుల పెట్టుబడులు
- శ్వేత విప్లవానికి బాటలు వేసిన కేసీఆర్ ప్రభుత్వం
- స్వరాష్ట్ర రైతుల పుట్టిముంచుతున్న రేవంత్ సర్కారు
- ఒక్కో లీటర్‌పై రూ.4 నుంచి రూ.7 వ్యత్యాసం
- అదే ధరకు సేకరిస్తే రాష్ట్ర పాడి రైతుకు తీవ్ర నష్టం

ఈ నెల 23న ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో రోడ్డుపై పాలను పారపోసి నిరసన తెలుపుతున్న పాడి రైతులు

కరీంనగర్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పాడి రైతు మెడపై ప్రాంతేతరుల కత్తి వేలాడుతున్నది. స్వరాష్ట్రంలో శ్వేత విప్లవానికి కేసీఆర్ ప్రభుత్వం బాటలు వేస్తే.. కాంగ్రెస్ సర్కారు కుట్రల కారణంగా విజయ డెయిరీతోపాటు మిగిలిన కో ఆపరేటివ్ డెయిరీల మనుగడ కూడా ప్రమాదంలో పడే అవకాశం కనిపిస్తున్నది. ఏపీ సీఎం చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థ రాష్ట్రంలో రూ.200 కోట్లకుపైగా పెట్టుబడితో శామీర్‌పేటలో డెయిరీతోపాటు ఐస్‌క్రీం తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయబోతున్నట్టు తెలుస్తున్నది. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంపూర్ణంగా సహకరిస్తున్నట్టు సమాచారం. రాష్ట్రంలో పాలవిక్రయాల అతి పెద్ద మార్కెట్ హైదరాబాద్. ఇక్కడ రోజుకు 20 లక్షల నుంచి 22 లక్షల లీటర్లకుపైగా డిమాండ్ ఉంది. ఈ డిమాండ్‌కు అనుగుణంగా మార్కెట్‌ను అందిపుచ్చుకోవడంలో విజయ డెయిరీ లాంటివి కాస్త వెనుకబడగా..ఇపుడు ఆ మార్కెట్‌ను ప్రాంతేతర డెయిరీలు ఆక్రమిస్తున్నాయి. హెరిటేజ్, జెర్సీ, అమూల్, నందిని వంటి డెయిరీలు.. స్థానిక డెయిరీలకు మించి మార్కెట్‌లో విక్రయాలు చేస్తున్నాయి. ఒక్క హెరిటేజ్ వాళ్లే రోజుకు హైదరాబాద్‌లో 5 లక్షల లీటర్లకు పైగా పాల విక్రయాలు చేస్తున్నట్టు సదరు రంగంలోని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ సంస్థ పెట్టుబడులు పెట్టి హైదరాబాద్ మార్కెట్ మొత్తం శాసిస్తే రాష్ట్రంలోని విజయ డెయిరీతోపాటు కోఆపరేటివ్ డెయిరీలైన కరీంనగర్, ముల్కనూరు వంటి వాటి భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకునే ప్రమాదమున్నది.

రైతుల ఆదాయంపై దెబ్బ?

నిజానికి పాడి పరిశ్రమను ఆహ్వానించడం ఎవరూ తప్పుపట్టరు. కానీ సదరు పరిశ్రమతో రాష్ట్రంలోని పాడిరైతులకు వచ్చే ప్రమాదాలను పట్టించుకోకుండా రేవంత్ సర్కారు ముందుకెళ్తున్న తీరుపై విమర్శలొస్తున్నాయి. ఇప్పటికే హెరిటేజ్‌లాంటి సంస్థల దాటికి విజయ డెయిరీ కుదేలవుతుండగా.. ఇపుడు ఇతర కో–ఆపరేటివ్ డెయిరీలకూ ముప్పు పొంచిఉన్నది. దీనికి కారణం తెలంగాణతో పోలిస్తే ఆంధ్రాలో రైతులకు ఇచ్చే ఒక లీటర పాల ధరలో రూ.4 నుంచి రూ.7 వరకు వ్యత్యాసం ఉండడమే. ప్రస్తుతం 3 శాతం ఫ్యాట్ ఉన్న పాలను కరీంనగర్ డెయిరీ లీటర్‌కు రూ. 35.65కు కొనుగోలు చేస్తుండగా.. ఏపీలోని చిత్తూరులో రూ.31.50కు కొనుగోలు చేస్తున్నారు. 3.5 శాతం ఫ్యాట్ ఉన్న లీటర్‌పాలను చిత్తూరులో రూ.33కు కొనుగోలు చేస్తుండగా, కరీంనగర్ డెయిరీ రూ.40.25కు కొనుగోలు చేస్తున్నది. అంటే ఒక్కో లీటర్‌పై రూ.4 నుంచి రూ.7 వరకు తేడా ఉన్నది. అక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసి.. రాష్ట్రంలోని డెయిరీల మార్కెట్‌ను దెబ్బతీసేందుకు సరికొత్త స్కీమ్ పెట్టిలేదా.. ధర తగ్గించి సదరు కంపెనీలు పాలు అమ్మే పరిస్థితులు కనిపిస్తున్నాయి. హైదరాబాద్‌లో ఇప్పటికే పలు పాల కంపెనీలు ఈ తరహా మార్కెటింగ్‌కు పాల్పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రాంతేతర డెయిరీల పోటీని తట్టుకోవాలంటే రాష్ట్రంలోని కోఆపరేటివ్ డెయిరీలైన కరీంనగర్, ముల్కనూరు డెయిరీలు కూడా రైతుకు ఇచ్చే పాలసేకరణ ధరను తగ్గించాల్సి ఉంటుంది. పాల ధర తగ్గించకపోతే మార్కెట్ విక్రయాల్లో ఈ డెయిరీలు వెనుకబడిపోయే ప్రమాదమున్నది. తద్వారా డెయిరీలే మూతపడే ప్రమాదమున్నది. అదే జరిగితే కరీంనగర్, మూల్కనూర్ డెయిరీ పరిధిలోనే దాదాపు 3 లక్షలకు పైగా పాడి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదమున్నది. ప్రాంతేతర డెయిరీల మార్కెట్‌కు దీటుగా పాలసేకరణ ధరలు తగ్గిస్తే రైతులకు గిట్టుబాటు కావన్నది నిపుణుల అభిప్రాయం. ఆంధ్రాలోని పాడిరైతులకు వచ్చే ఖర్చుతో పొల్చితే.. తెలంగాణలో వాతావారణం, ఇతర మార్పుల నేపథ్యంలో 25 శాతానికిపైగా అదనపు ఖర్చు వస్తుందని పాడిపరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక్కడి రైతాంగానికి సరిపడా రేటు గిట్టుబాటు అయ్యేందుకు కావాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టిపెటాలన్న అభిప్రాయాలు వ్యక్తవుతున్నాయి.

నవంబర్‌లో రిజిస్ట్రేషన్ బాదుడు!

- భారీగా పెరగనున్న చార్జీలు
- తుదిదశకు చేరిన థర్డ్ పార్టీ ఏజెన్సీ అధ్యయనం

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): నవంబర్ నుంచి సవరించిన చార్జీలను రిజిస్ట్రేషన్ చార్జీలను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. వాస్తవానికి వ్యవసాయ, వ్యవసాయేతర, స్థిరాస్తుల రిజిస్ట్రేషన్‌కు కొత్త ధరలను ఆగస్టు 1 నుంచే అమలు చేయాలని భావించింది. ఈ మేరకు స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ జూన్‌లో షెడ్యూల్‌ను విడుదల చేసింది. అధికారులు జిల్లాల్లో అధ్యయనం చేసి ప్రభుత్వానికి జూలైలో నివేదిక ఇచ్చారు. ఈ నివేదికపై ప్రభుత్వం సంతృప్తి చెందలేదు. దీంతో ధరల సవరణ అధ్యయన బాధ్యతలను ఓ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వే నంబర్ల వారీగా భూముల విలువను అధ్యయనం చేసి, ఎక్కడ పెంచేందుకు అవకాశం ఉన్నదో, ఎక్కడ తగ్గించాల్సి వస్తుందో, ఎంత మేర సవరించాలో సూచించాలని పేర్కొన్నది. ఈ మేరకు ప్రైవేట్ సంస్థ అధ్యయనం తుది దశకు చేరిందని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు తెలిపాయి. ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం పనులు ప్రారంభం కావడం, ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్త నగరాన్ని నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యాల నేపథ్యంలో వాటి చుట్టుపక్కల ప్రాంతాల్లో భూముల సవరణపైనా అధ్యయనం చేసినట్టు చెప్తున్నారు. వారంరోజుల్లో ఈ నివేదిక ప్రభుత్వానికి చేరనున్నట్టు సమాచారం. ప్రభుత్వం సమీక్ష అనంతరం ఏ స్థాయిలో ధరలను సవరించాలో నిర్ణయిస్తారని చెప్తున్నారు. నవంబర్ మొదటివారంలో పెంపును అమలు చేసే అవకాశం ఉంది. 'ఇది రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు కాదు. శాస్త్రీయంగా ధరల స్థిరీకరణ. స్థానిక పరిస్థితులను బట్టి చార్జీలు పెంచాలో, తగ్గించాలో నిర్ణయం తీసుకొని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది' అని రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారి తెలిపారు.

బది'లీలల'పై కొరడా?

రిజిస్ట్రేషన్ల శాఖలో ఇటీవల బదిలీల్లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకుంటారని సమాచారం. ఈ బదిలీల్లో అధికార పక్ష నేతలు, ఉన్నతాధికారుల సన్నిహితులకు కోరుకున్న స్థానాలను కట్టబెట్టారని ఆరోపణలు వచ్చాయి. రూ.కోట్ల మేర చేతులు మారినట్టు చర్చ జరిగింది. కొందరు అధికారులే దళారుల అవతారం ఎత్తి పోస్టింగ్‌ల బదిలీలల్లో కీలక పాత్ర పోషించారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ మంత్రి, సీఎం గుర్రుగా ఉన్నట్టు సచివాలయ వర్గాలు చెప్తున్నాయి. త్వరలోనే చర్యలు తీసుకోనున్నట్టు సమాచారం.

సగం చేపపిల్లలకు సర్కారు కోత

- తొలుత 85 కోట్ల పిల్లల పంపిణీకి ఏర్పాట్లు
- టెండర్ల సమయానికి 40కోట్లకే పరిమితి
- కాంగ్రెస్ ప్రభుత్వం నిధులవ్వకనే ఈ దుస్థితి
- నాలుగుసార్లు టెండర్లు పిలిచినా స్పందన కరువు
- బకాయిలపై ప్రశ్నించిన రైతులకు బెదిరింపులు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఉచిత చేపపిల్లల పంపిణీలో ప్రభుత్వం కోత పెట్టింది. సగానికి సగం కోత పెట్టిన ప్రభుత్వం 50శాతం చేపపిల్లల్ని మాత్రమే పంపిణీ చేయాలని నిర్ణయించింది. తొలుత 85 కోట్ల చేపపిల్లల పంపిణీకి ప్రణాళికలు రూపొందించిన మత్స్యశాఖ.. టెండర్ల సమయానికి 40 కోట్లకే పరిమితం చేసింది. చేపపిల్లల పంపిణీలో కోతకు ప్రభుత్వం తగినన్ని నిధులు ఇవ్వకపోవడమే కారణమని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న నిధులతో 40కోట్లు పంపిణీ చేస్తామని, ప్రభుత్వం నిధులిస్తే మిగిలిన సగం పంపిణీ చేస్తామని స్పష్టం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతియేట 80 కోట్ల చేపల పిల్లల్ని, మరో 10 కోట్ల రొయ్య పిల్లల్ని పంపిణీ చేసేంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తొలి ఏడాదే చేపపిల్లల పంపిణీకి కోత పెట్టడంపై మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగుసార్లు టెండర్లు పిలిచినా...

ఈ ఏడాది చేపపిల్లల పంపిణీకి మత్స్యశాఖ ఆపసోపాలుపడుతున్నది. జూలై 9నుంచి నేటి వరకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతూనే ఉన్నది. రెండున్నర నెలల్లో నాలుగుసార్లు టెండర్లు పిలిచినా పంపిణీదారుల నుంచి స్పందన కరువైంది. గతేడాది బకాయిలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఇవ్వకపోవడంతో పంపిణీదారులు ముందుకు రావడం లేదు. పాత బకాయిలు ఇస్తేనే టెండర్లలో పాల్గొంటామని పంపిణీదారులు చెబుతున్నారు. తొలుత పిలిచిన టెండర్‌లో ఒకే ఒక దరఖాస్తురాగా, రెండోసారికి 4దరఖాస్తులు వచ్చాయి. మూడోసారి 27వరకు దరఖాస్తులు వచ్చినట్టుగా తెలిసింది. ఇందులో కొంతమందికి వెరిఫికేషన్‌లో చేపల చెరువులు లేకపోవడంతో వారిని తిరస్కరించారు. ఇప్పుడు 19 జిల్లాలకు దరఖాస్తులు ఒకే కాగా 12 జిల్లాలకు మళ్లీ దరఖాస్తులు పిలిచారు. వీటి ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొన్నది.

బ్లాక్‌లిస్టులో పెడుతాం

చేపల పంపిణీ రైతులపై మత్స్యశాఖలోని అధికారులు బెదిరింపులకు దిగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత పంపిణీదారు రైతులను పిలిపించిన అధికారులు.. వారం పది రోజుల్లో బకాయిలు ఇప్పిస్తామని హామీ ఇచ్చి టెండర్లలో పాల్గొనాల్సిందిగా కోరినట్టు ఓ పంపిణీదారు తెలిపారు. అధికారుల హామీతో టెండర్లలో పాల్గొన్నామని, పదిహేను రోజులు గడిచినా బకాయిల ఊసెత్తడంలేదని తెలిపారు. దీనిపై అధికారులను ఆరా తీస్తే.. బకాయిలు ఇచ్చే పరిస్థితిలేదని, టెండర్‌లో ఎంపికైన వాళ్లు అగ్రిమెంట్ చేసుకోవాలని ఆదేశించినట్టుగా తెలిసింది. రైతులు అగ్రిమెంట్‌కు నిరాకరించగా 'మీ బకాయిలు ఎలా వస్తాయో చూస్తాం. మీ డిపాజిట్ డబ్బులను బ్లాక్ చేస్తాం. మళ్లీ టెండర్లలో పాల్గొనకుండా బ్లాక్‌లిస్టులో పెడతాం' అంటూ బెదిరించినట్టుగా ఓ పంపిణీదారు ఆవేదనను వ్యక్తం చేశారు.

పంపిణీ ఇంకెప్పుడు ?

ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభంకావాల్సిన చేపల పంపిణీ ప్రక్రియ సెప్టెంబర్ పూర్తవుతున్నా టెండర్ దశలోనే ఉంది. పంపిణీ ఆలస్యమవుతుండడంతో ఏప్రిల్ వరకు చెరవులు, కుంటల్లో నీళ్లు తగ్గి చేపలు ఆశించిన స్థాయిలో పెరుగవని మత్స్యకారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. నాలుగైదేండ్లుగా పుష్కలమైన చేపలను విక్రయించి ఆర్థికంగా భరోసా దక్కిందని, ఇప్పుడు పంపిణీ ఆలస్యం అవుతుండడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా 50శాతం పంపిణీ నిర్ణయాన్ని విరమించుకొని 100శాతం పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

యువతిపై ప్రేమోన్మాది దాడి

సాయికుమార్ (ఫైల్)

రామంతాపూర్, సెప్టెంబర్ 26: ఓ యువతిపై ప్రేమోన్మాది దాడి చేసిన ఘటన ఉప్పల్ బస్‌స్టాప్ వద్ద గురువారం చోటుచేసుకుంది. భువనగిరికి చెందిన రాగల సాయికుమార్(24), ఓ యువతి గతంలో ప్రేమించుకోగా.. మనస్పర్థలు రావడంతో విడిపోయారు. చాలా రోజుల తర్వాత ఈ ఇద్దరూ గురువారం ఉప్పల్ బస్‌స్టాప్ వద్ద కలుసుకోగా.. తనను ప్రేమించాలంటూ సాయికుమార్ యువతిపై ఒత్తిడి చేశాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో ఆమెపై కత్తితో దాడిచేశాడు. యువతి వేలికి గాయం కాగా, స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న యూఎస్‌పీసీ సభ్యులు

రేపు యూఎస్‌పీసీ, ఎస్టీటీయూ నిరసనలు

- జీవో 25ను సవరించాలని డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : సర్దుబాటుకు ముందే బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలిపి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని యూఎస్‌పీసీ, ఎస్టీటీయూ పిలుపునిచ్చాయి. మరోవైపు జీవో 25లోని నిబంధనలు సవరించాలని కోరుతూ గురువారం యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు కే జంగయ్య, పీ నాగిరెడ్డి పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని కలిసి వినతిపత్రాలు అందజేయగా, ఎస్టీటీ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, వెంకటేశం సైతం వినతిపత్రం సమర్పించారు.

జైనూర్ ఘటనపై విచారణ చేపట్టాలి



ఖైరతాబాద్, సెప్టెంబర్ 26: ఆదిలాబాద్ జిల్లా జైనూర్‌లో ఈ నెల 4న జరిగిన ఘటనపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సామాజిక, పౌర హక్కుల కార్యకర్తలు ఖలీదా పర్వీన్, సరా మాథ్యూస్, మసూద్, ప్రొఫెసర్ పద్మజాషాతో కలిసి మాట్లాడారు. జైనూరులో ఉద్దేశపూర్వకంగానే ఒక వర్గంపై దాడులు, దౌర్జన్యాలు జరిగాయని, దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.